అదుపులేక.. అడ్డదిడ్డంగా రాకపోకలు

- నాగోల్ బండ్లగూడలోని ఆనంద్‌నగర్ చౌరస్తాలో ట్రా'ఫికర్'
- రోడ్డు విస్తరణ జరిగినా కూడలిలో నియంత్రణ కరువు
- ఏ క్షణం.. ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయం

మన్సూరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడలోని ఆనంద్‌నగర్ చౌరస్తాలో అడ్డూ అదుపు లేకుండా వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బంది తలెత్తుతోంది. ఏ క్షణం ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయాందోళన పలువురు పాదచారులు, వాహనదారులతో పాటు స్థానికుల్లో నెలకొంది. నాగోల్ నుంచి బండ్లగూడ ఆనంద్‌నగర్‌చౌరస్తా, తట్టి అన్నారం, ఓఆర్ఆర్ మీదుగా నగర నలుమూలల నుంచి నిత్యం వందలా ది చిన్న నుంచి భారీ, అతి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా రోడ్డు చాలా చిన్నదిగా ఉండడంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో బండ్లగూడ చౌరస్తా నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తా వరకు సీసీ ద్వారా రోడ్డు విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అసలు సమస్య ఆనంద్‌నగర్‌చౌరస్తా వద్ద నియంత్ర సూచీలు, సిగ్నల్ ఏర్పాటు చేయకపోవడంతో పాటు కనీసం ఒక ట్రాఫిక్ సిబ్బంది నియమించకపోవడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లుగా వా రు అడ్డదిడ్డంగా.. అడ్డూఅదుపు లేకుండగా రాకపోకలు సాగిస్తుండడంతో అసలు సమస్య మొదలైంది. ఇక్కడ ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోన్న భయాందోళన కేవలం స్థానికులు, పాదచారులే కాకుండా వాహనదారుల్లోనూ నెలకొంది.



ఆనంద్‌నగర్‌చౌరస్తాలో అడ్డూ అదుపు లేకుండా ఇష్టం వచ్చినట్లుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, పాదచారులు

తగిలించడం.. తప్పయ్యిందని వెళ్లిపోవడం..

ఎలాంటి నియంత్రణ సూచీలు లేకపోవడంతో ఆనంద్‌నగర్‌చౌరస్తా వద్ద ఇష్టారీతిన వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పలుమార్లు చిన్నపాటి ప్రమాదాలు సైతం సంభవించారు. ఇలా అడ్డదిడ్డంగా వాహనాలు నడపడంతో అనవసరపు ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడడం జరుగుతుంది. ముఖ్యంగా వాహనాలను ఢీకొట్టడం.. తప్పయ్యిందని చెప్పి తప్పించుకుని వెళ్లిపోవడం, చిన్నపాటి గొడవలు పడడం పరిపాటిగా మారింది.

ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే సిబ్బంది

ఏవైనా ప్రత్యేక సందర్భాలు జరిగినప్పుడు మాత్రమే ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిబ్బంది వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు కనిపిస్తుంటారని తెలుస్తోంది. ముఖ్యంగా పండుగలు, ర్యాలీలు, వీఐపీల రాకపోకలు ఉన్న సమయాల్లో మాత్రమే ఉండడం మిగితా సమయాల్లో వారు లేకపోవడం గమనార్హం.

ప్రమాదాలు జరగక ముందే నియంత్రణ చేపట్టండి

ఆనంద్‌నగర్‌చౌరస్తా వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో ఊహించలేకపోతున్నామని పలువురు పాదచారులు, వాహనదారులు, స్థానికులు పేర్కొంటున్నారు. ముందు ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు తేరుకుని నియంత్రణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

తక్షణ నియంత్రణకు రోడ్డుపై లైన్స్ వేయిస్తున్నాం



ఆనంద్‌నగర్‌చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తగ్గినప్పటికీ సూచికలు లేకపోవడంతో వాహనాలు, పాదచారులు ఇష్టం వచ్చినట్లు గా రాకపోకలు సాగిస్తున్నారు. అక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఉంచుతున్నాం. వాహనాలు, పాదచారుల అడ్డూఅదుపులేని రాకపోకల నియంత్రణకు రంబుల్, జీబ్రా క్రాసింగ్ లైన్లు వేయాలని జీహెచ్ఎంసీని కోరడం జరిగింది. త్వరలోనే అక్కడ లైన్లు వేయడం జరుగుతుంది. ట్రాఫిక్ డీసీపీ సహకారంతోనే గతంలోనే సిగ్నల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో ఏర్పాటు చేయలేకపోయాం. త్వరలోనే సిగ్నల్ ఏర్పాటు చేసి సిగ్నల్ వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చొరవచూపుతాం.

\- డి.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎల్బీనగర్



న్యూ మారుతీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీ

తిరంగా ర్యాలీ

కొత్తపేట, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేపట్టిన భారత త్రివిధ దళ సైన్యానికి మద్దతునిస్తూ న్యూ మారుతీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ భవనం నుంచి ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలు జాతీయ పతాకాన్ని చేతబట్టి, సైన్యం పోరాట చిత్రాల ప్లకార్డులు ప్రదర్శిస్తూ నడుస్తూ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తిరం గా బైక్ ర్యాలీ న్యూమారుతీనగర్ నుంచి కొత్తపేట క్రాస్‌రోడ్స్ మీదుగా దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురి శివాజీ విగ్రహ ప్రాంతం నుంచి న్యూ మారుతీనగర్ మహాత్మాగాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో సంఘం అధ్యక్షుడు నీరంకి రవి, కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు గంధం రవికేశవ్, అంజనేయులు, అరుణ్ కుమార్, సత్తయ్య, రాంచందర్, ఉపేందర్, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



బాబుశ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దళితుల సంక్షేమానికి కృషి

ఓల్డ్‌మలక్‌పేట, మే 18(ఆంధ్రజ్యోతి) : దళిత, వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని మలక్‌పేట దళిత సేవాసంఘం అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ అన్నారు. మలక్‌పేట దళిత సేవాసంఘం అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన ఆయనను ఓబీసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చౌకి రవికుమార్, చీపిరి రాజారావు, మహ్మద్‌గౌస్, గడ్డం నరేందర్, విజయ్‌కుమార్, రాజేశ్, మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.



సన్‌రైజ్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

సన్‌రైస్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 18(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని సన్‌రైస్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా గిరి వెంకటయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా విజయ్, చైతన్య సెక్రెటరీగా మనోహర్, కోశాధికారిగా చంద్రమౌళి, జాయింట్ సెక్రెటరీలు రవి, నాగేంద్ర, సతీష్‌గౌడ్, ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రసాద్ శర్మతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కాలనీ లభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు.

యువకుడి మెడలో బంగారు గొలుసు చోరీ

అమీర్‌పేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడి మెడలో బంగారు గొలుసు చోరీకి గురైంది. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు జిల్లా కేంద్రానికి చెందిర ఈశ్వర్ వెంకట్ సాయి (19) అత్తాపూర్ హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ సమీపంలో మిత్రులతో కలిసి ఉంటూ మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్ మేనేజ్‌మెంట్‌లో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 16న చదువు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళుతున్న సమయంలో కళ్యాణ్ నగర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి మైత్రీవనం బస్టాప్‌లో దిగాడు. కొద్ది సేపటికి తన మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు చైన్ కనిపించలేదు. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో చేసేదేమిలేక ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె అడిగితే దాడి చేశారు..

యూసుఫ్ గూడ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి అద్దె ఇవ్వాలని అడిగితే దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్‌లో చాటి శివకుమార్ సుజాత ఇంట్లో మమత అద్దెకు దిగారు. ఆమె స్నేహితురాలు సుప్రియ కొన్ని నెలల తరువాత పెంట్ హౌస్‌లో అద్దెకు దిగింది. ఇద్దరు కొన్ని నెలలు అద్దె చెల్లించకుండా, తరువాత ఇస్తామని ఇల్లు ఖాళీ చేశారు. యజమాని అద్దె ఇవ్వాలని అడగడంతో మమత భర్త హేమంత్ దాడికి దిగాడు. శివకుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.



లింగమయ్య గుట్ట వద్ద కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, శ్రీరాములుయాదవ్ తదితరులు

హరోం హర.. ఓం నమఃశివాయ..!

శివనామస్మరణతో మార్మోగిన లింగమయ్యగుట్ట ● వేడుకగా స్వామి వారి కల్యాణం ● బోనాలు సమర్పించిన భక్తులు

సరూర్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): 'హరోం హర.. ఓం నమః శివాయ'.. అంటూ భక్తులు చేసే శివనామస్మరణతో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల లింగమయ్యగుట్ట మార్మోగిపోయింది. లింగస్వామి జాతరలో భాగంగా శనివారం పుట్ట బంగారం, గంప జాతర నిర్వహించిన స్థానిక శ్రీగోపాలకృష్ణయాదవ సంఘం ప్రతినిధులు.. ఆదివారం లింగస్వామి-మాణిక్యాలదేవి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం యాదవ సంప్రదాయం ప్రకారం నాగవెల్లి నిర్వహించి.. ఆ తర్వాత మెట్ల మార్గం పక్కన గల బోనాల గుండు వద్ద భక్తులు బోనాలు సమర్పించారు. చౌడమ్మ తల్లికి యాటలు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో గుట్ట పరిసరాలు జన సంద్రంగా మారాయి. నిర్వాహకులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద భక్తులు సేద తీరడమే కాకుండా బోనాలు సైతం అక్కడే చేసి అమ్మవారికి సమర్పించారు.



లింగమయ్య సేవలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

లింగస్వామి సేవలో అతిథులు..

నాదర్‌గుల్‌లో అట్టహాసంగా జరిగిన లింగస్వామి జాతరలో స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పట్టించుకోవడం లేదని ధర్నా

- ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై బండ్లగూడ గ్రామస్థుల నిరసన

మన్సూరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడ గ్రామంలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తూ ఆదివారం నాగోల్-బండ్లగూడ ప్రధాన రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండ్లగూడ గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్ ద్వారా సరిపడా తాగునీరు అందడం లేదని, పెరిగిన జనాభాకు అనుగుణంగా అధిక సామర్థ్యం గల పైప్‌లైన్ వేసి సరిపడా నీరు అందేలా చూడాలన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పలు కాలనీల్లో డ్రైనేజీ మురుగు తాగునీటిలో కలుషితమై వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం విన్నవించుకున్నామని, అయినా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బండ్లగూడ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మెట్టు రవీందర్‌గౌడ్, తూర్పాటి ధన్‌రాజ్, పంగ శ్యాంకుమార్, సత్యనారాయణ గౌడ్, కందికంటి రాఘవేందర్, సహదేవ్‌గౌడ్, భవానీశంకర్, రాము, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ సమస్యలు పరిష్కరించాలని రోడ్డుపై ధర్నా చేపడుతున్న గ్రామస్థులు

పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాస సభ నేడు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినయ్‌కుమార్, రమణరావు తదితరులు

రాంనగర్, మే 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణసాయుధ పోరాటయోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఈనెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో సుందరయ్య స్మారకోపన్యాస సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1987లో సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రం నుంచి పేదలు, కార్మికులకు విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేసిందన్నారు. 19వ తేదీన సాయంత్రం ఎస్వీకేలో సుందరయ్య స్మారకోపన్యాసం సందర్భంగా నేటి రాజకీయాలు- షహీద్ భగత్‌సింగ్ చరిత్రపై ప్రొఫెసర్ చమన్‌లాల్ ప్రసంగించనన్నారని తెలిపారు. దీనికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, బుచ్చిరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు భూపతి వెంకటేశ్వర్లు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

మావోలతో చర్చలు జరపాలి



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

రాంనగర్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోలతో శాంతి చర్చలను జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు, గోవర్ధన్ మాట్లాడారు. భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో కాల్పుల విరమణకు స్వస్తి పలికి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు. సాయుధ పోలీసులను క్యాంపుల నుంచి సత్వరమే తరలించాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్ట నుంచి సాయుధ పోలీసులు వెనక్కిరావాలని డిమాండ్ చేశారు. కగార్‌ను వ్యతిరేకిస్తూ శాంతియుత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

బిట్స్‌పిలానీ, మే 18(ఆంధ్రజ్యోతి) : జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సీఆర్పీఎఫ్, అరుంధతినగర్‌కు చెందిన వివాహిత యువతి అదృశ్యం అయిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్ గ్రామానికి చెందిన శివకుమార్ నిషాద్ అతని భార్య రాధికాదేవి(22)లు అరుంధతీనగర్‌లో సంవత్సర కాలంగా కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నారు. ఈనెల 17న శివకుమార్ కూలీ పనుల కోసం బయటకు వెళ్లాడు. భోజనం కోసం మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి రాధిక కనిపించలేదు. రాధికకు ఫోన్‌చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. దీంతో చుట్టు పక్కల, బంధువులు, పుట్టింటి వాళ్లకు ఫోన్ చేసి వెదికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మౌలిక సదుపాయాలకు నోచుకోని బృందావన్‌కాలనీ

- వర్షాల వేళ రోడ్లపై వరదనీటితో ఇబ్బందులు
- కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు
- వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు

కొత్తపేట, మే 18(ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల క్రితం ఏర్పడిన కాలనీ అది. ఆ కాలనీ మౌలిక సదుపాయాలకు నోచుకోక కాలనీవాసులు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉప్పల్ మండల పరిధి కొత్తపేట సర్వే నెం.106,107,108,109లలో 2022లో ఏర్పాటైన బృందావన్ కాలనీ అది. మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు ఎదురు చూస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా వారి స్పందన కరువై కాలనీవాసులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి. ఆ కాలనీలో ప్రస్తుతం ఉన్న 60 ఇళ్లకు తోడుగా ఇంకా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

రోడ్లు నిర్మించండి మహా ప్రభో..

కాలనీలో పక్కాగా రోడ్లు నిర్మించండి మహా ప్రభో అని కాలనీవాసులు వేడుకుంటున్నారు. చిన్న పాటి వర్షానికే మట్టి రోడ్లన్నీ జలమయమై, రోజుల తరబడి దారుల గుంతల్లో వరదనీరు మురుగునీరు చేరుతోంది. దారులు బురదమయంగా మారి నడవడానికి, వాహనాల రాకపోకలకూ అసౌకర్యానికి గురవుతున్నామంటూ వాపోతున్నారు. వర్షాకాలం మొదలయ్యే లోగా సత్వరమే సీసీ రోడ్లు నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విన్నవిస్తున్నారు.



బృందావన్ కాలనీ రోడ్ నెం.3లో మురుగు నీరు



బృందావన్ కాలనీ రోడ్డు పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తా చెదారం

డ్రైనేజీ వ్యవస్థలేక.. పారిశుధ్య పనులు చేపట్టక..

బృందావన్‌కాలనీలో డ్రైనేజీ వ్యవస్థలేకపోవడంతో మురుగునీరు దారులపైకి చేరుతోంది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీనికితోడు మూసీకి దగ్గరలో ఉండడం కూడా దోమల సమస్య తీవ్రంగా ఉందంటున్నారు. జలమండలి అధికారులు కాలనీలో పర్యటించాలనీ, అంచనాలు సిద్ధం చేసి పైప్‌లైన్లు వేయించాలని కోరుతున్నారు. కాలనీలో పారిశుధ్యం కోసం తగిన చర్యలు తీసుకోకపోవడంతో వ్యర్థాలు, చెల్లాచెదారంగా దారులపక్కన వేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పందులు తిరుగుతున్నాయి.

విద్యుత్ లైన్లు ఏర్పాటు లేకపోవడంతో..

కాలనీలో విద్యుత్ లైన్లు ఏర్పాటు లేకపోవడం మరో సమస్య. రాత్రివేళ బయటి ప్రాంతాల నుంచి జులాయిలు నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వీధి దీపాల వ్యవస్థలేక కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు.



బృందావన్ కాలనీలో రోడ్డు దుస్థితి

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



బృందావన్‌కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కరించాలి. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులకు పలు మార్లు ప్రధాన సమస్యలను విన్నవించాం. 2022 మార్చి 26న కాలనీ శిలాఫలకం ఆవిష్కరణకు విచ్చేసిన ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్‌లకు సమస్యలను విన్నవించాం. వర్షాకాలంలోగా అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి.

\- శ్రీనివాస్‌యాదవ్ కొరివి, అధ్యక్షుడు, బృందావన్‌కాలనీ సంక్షేమ సంఘం

గుండెపోటుతో సునీల్ మృతి

- సంతాపం వ్యక్తం చేసిన బ్రాహ్మణ సంఘాలు



సునీల్(ఫైల్)

మన్సూరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవి చారిటబుల్ వ్యవస్థాపకులు, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి సభ్యుడు మంత్రి సునీల్ (55) నాగోల్ బండ్లగూడలోని ఆయన నివాసంలో ఆదివారం గుండెపోటుతో మరణించారు. పేద విద్యార్థులకు విద్యాదానం చేయాలనే సంకల్పంతో శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా పోచంపల్లి రమణారావు, కోశాధికారిగా దేవులపల్లి రంగారావు, మరి కొందరి సభ్యులను నియమించి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన సునీల్ ఎంతో మంది విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా విద్యాదానం చేశారు. సునీల్ మృతి పట్ల పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు, ట్రస్టు సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. కాగా మంత్రి సునీల్ అన్నయ్య అమెరికా నుంచి రావాల్సి ఉ న్నందున ఆయన అంత్యక్రియలు 20వ తేదీన నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సునీల్ మృతి తీరనిలోటు

- పోచంపల్లి రమణారావు

సేవా స్వభావి మంత్రి సునీల్ మృతి బ్రాహ్మణ సేవా సమితి, శ్రీవైష్ణవి ట్రస్టుతో పాటు ఎంతో మందికి తీరని లోటని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు విచారం వ్యక్తం చేశారు. సునీల్ పార్థీవదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేసిన రమణారావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. 20వ తేదీన జరిగే సునీల్ అంతిమయాత్రలో బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొని వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని పిలుపునిచ్చారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో దేవులపల్లి రంగారావు, డి.శివకుమార్, డి.శేషగిరిరావు, గూడ జయరాం, గూడ రాజేశ్వరరావు, నర్వ రఘు, అక్కిరాజు దుర్గా ప్రసాద్, చెన్నూరి లక్ష్మీనరసింహారావు, కానాల శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

ఎఫ్ఓబీ నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 18 (ఆంధ్రజ్యోతి): హుందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం - 5 వద్ద గల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్మయ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి 35 ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు.

మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.